క్లుప్తంగా

అర్హులందరికీ చేయూత వర్తింపజేయాలి

అమరచింత: జాబ్‌కార్డు కలిగి ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం చేయూత పథకాన్ని వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారికే చేయూత పథకం వర్తింపచేస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి సంక్షేమ పథకాలను నిరుపేదలకు వర్తించేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇలా నిబంధనల పేరిట పేదల బతుకులను ఆగం చేయకూడదన్నారు. జాబ్‌కార్డు ఉన్నా లేకున్నా, భూమిలేని కుటుంబాలు ఎంతమంది ఉన్నా చేయూత పథకం వర్తింపచేయాలని కోరారు. చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను గ్రామ పంచాయతీ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు గురువులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గురువులు కృష్ణారెడ్డి, కురుమూర్తి, సత్యనారాయణ, ఈశ్వరయ్య, పురుషోత్తం, గోపాల్, భాస్కర్, సునీత, విద్యార్థులు మహ్మద్‌గౌస్, రాములు, రాజు, భానుప్రకాష్, రవి, ఎర్రన్న, బాలరాజు, విజయ కృష్ణ, మహేష్ తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ సామాజిక తనిఖీ గ్రామసభలు

పాన్‌గల్: మండలంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని అన్నారం, జమ్మాపూర్, రాయినిపల్లి గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి, 2024 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై చర్చించారు. మూడు గ్రామాలకు సంబంధించి రూ.77.12 లక్షలకు సంబంధించిన పనులు, చేసిన ఖర్చుపై గ్రామ సభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.

నేడుగ్రామసభలు

మండలంలోని బహుదూర్‌గూడెం, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, బండపల్లి, చింతకుంట, కొత్తపేట, కిష్టాపూర్‌తండా, మంగళ్లపల్లి, శాగాపూర్‌తండా, మాధరావుపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

ఖిల్లాఘనపురం: దివ్యాంగుల సంఘం మండల కమిటీ అధ్యక్షులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ జనార్దన్ తెలిపారు. మండల కేంద్రంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించి మండల పురుషుల కమిటీ అధ్యక్షుడిగా ఎం.చంద్రాయుడు, మహిళల కమిటీ అధ్యక్షురాలిగా శాంత ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతు మండల కమిటీల అధ్యక్షులుగా ఎంపికైన వారు మండలంలోని ప్రతి గ్రామంలో దివ్యాంగుల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరం వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేర్చుతామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు రామకృష్ణ, యాదయ్య, లక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: నిద్రిస్తున్న ఓ వ్యక్తితో గొడవపడి, దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ముదరితండాకు చెందిన నేనావత్ హర్యా ఈ నెల 22న రాత్రి ఇంటి ముందు నిద్రిస్తున్న సమయంలో.. అదుతండాకు చెందిన నేనావత్ సోమ్లా, హనుమంతు, మేగ్యా వచ్చి హర్యతో గొడవ పెట్టుకున్నారని చెప్పారు. పరుషపదజాలంతో దూషిస్తూ చేతులు, కట్టెలతో కొట్టారన్నారు. హర్య చేతులకు గాయాలు కావడంతో కేకలు వేయగా ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చి చూడగా వారు ముగ్గురు అప్పటికే అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయమై గురువారం బాధితుడి కుమారుడు నేనావత్ పాండు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లిదండ్రులే తొలి ఆరాధ్యులు

- కనులపండువగా అయ్యప్ప మండల పూజ
- ఆభరణాలతో భక్తులకు దర్శనమించిన అయ్యప్పస్వామి



అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

వనపర్తిటౌన్: అయ్యప్ప దీక్షాపరులకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ తల్లిదండ్రులు, గురువులే ప్రథమ ప్రత్యక్ష ఆరాధ్యులు కావాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ప్రతి ఏడాది శబరిమలలో జరిగే మండల పూజ మహోత్సవానికి ప్రతీకగా గురువారం అయ్యప్ప సేవా సమతి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో అన్నమయ్యప్ప ఆరాధనోత్సవం అఖండ శరణుఘోష మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి మొదలైన పూజ కార్యక్రమాలు భక్తుల భజనలతో రాత్రి 11: 30 నిమిషాల వరకు మిన్నంటాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మను మించిన దైవం లేదని పరమాత్ముడు సైతం తల్లిదండ్రులకు, గురువులకు దాసోం అవుతాడనేందుకు ఎన్నో సందర్భాల్లో రుజువైందన్నారు. అయ్యప్ప పూజలో తల్లిదండ్రులు, గురువులకు పెద్దపీట వేశారని, వారి ఆశీస్సులుంటే అయ్యప్ప అనుగ్రహం తప్పక లభిస్తోందని తెలిపారు. అయ్యప్ప దీక్షతో బుద్ధి వికాస పరిణతి పెంపొందుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు గురుస్వాముల చేతుల మీదుగా అయ్యప్ప ఆలయం ఎదుట గల ఏకాశిల పదునెట్టంబడి పడి పూజను ఘనంగా జరిపించారు. ఒక్కొక్క మెట్టుకు ప్రత్యేకంగా పూజను నిర్వహించి ఆయా దేవత మూర్తి విగ్రహాన్ని ఆవానచేశారు. ఈ పడిపూజ రాత్రి 11:30 నిమిషాల వరకు సాగింది



అభిషేక మహోత్సవ హారతిని అందుకుంటున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాలధారులకు బిక్ష వడ్డిస్తున్న మాజీ ఎంపీ రావుల

అన్నమయ్యప్ప ఆరాధాన

గురుస్వాములు అన్నంతో అన్నమయ్యప్పను తయారు చేసి హరిహరసుతుడిని ఆవాహనం గావించి భాజాభజంత్రీలతో అన్నమయ్యప్పను శణుఘోషల మధ్య మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆలయంలోకి తీసుకొచ్చారు. అన్నమయ్యప్పను దర్శించుకున్న వారికి ఏడాది పాటు అన్నానికి లోటుండదని గురుస్వాములు భక్తులకు వివరించారు. అన్నమయ్య ఆరాధాన తర్వాత అయ్యప్ప స్వామి శబరిమలలో దర్శనమిచ్చే రీతిలో వనపర్తిలో ఆభరాణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామికి అభిషేకాలు, చక్రస్నానం తదితర పూజాధికాలు నిర్వహించారు. అలాగే స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రికి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని గోపాల్‌పేట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివన్న సూచించారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి సర్వే చేస్తున్న అధికారుల వద్దకు చేరుకుని సర్వే తీరును పరిశీలించారు. యాప్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు చేయొద్దని సూచించారు. ముందుగా ఖాళీస్థలాలు ఉన్న పేదలు, కవర్లతో కప్పిన ఇళ్లు, రేకుల ఇళ్లు ఇలా వివరాలు పక్కాగా నమోదు చేయాలని చెప్పారు. ఆయన వెంట చంద్రశేఖర్, వెంకటయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వనపర్తి విద్యావిభాగం: నల్గొండ పట్టణంలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్‌యూటీఎఫ్ 6వ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో జిల్లా నాయకులు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్‌గౌడ్, డి. కృష్ణయ్య మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ మహాసభల్లో విద్యారంగం ప్రతిష్టం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం చర్చిస్తామన్నారు. మహాసభలకు హాజరైౖ ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఓడీ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.వెంకటేష్, హమీద్, శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, లక్ష్మణ్ నాయక్, బక్కన్న, సూరయ్య, అయోధ్య రాములు, అర్జున్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.85.87 లక్షల బోనస్



పాన్‌గల్‌లో కాంటా చేసిన ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేస్తున్న హమాలీలు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సన్న వడ్లకు రూ.85.87 లక్షల బోనస్ అందుకున్నట్లు సింగిల్ విండో అధికారులు గురువారం తెలిపారు. సింగిల్ విండో ద్వారా వివిధ గ్రామాల్లో 306 మంది రైతుల నుంచి 17,174 క్వింటాళ్ల సన్న వడ్లను సేకరించగా.. వారికి క్వింటాల్‌కు రూ.500 కలిపి రూ.2820 అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో పాటు లావు వడ్లు 1,266 మంది రైతుల నుంచి 6,845 క్వింటాళ్లు సేకరించి వారికి రూ.15.08 కోట్లు రైతులకు అందజేశామన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జాప్యం లేకుండా వెంటనే జమ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

విజేత జట్టుకు అభినందన

పాన్‌గల్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన వనపర్తి ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో విజేతగా నిలిచిన పాన్‌గల్ అంజి–11 జట్టు సభ్యులను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, సాగర్ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్యసాగర్, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌సాగర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో పోటీల్లో పాల్గొంటూ విజయాలు సాధిస్తూ మండలానికి పేరు తీసుకరావాలని వారు అకాంక్షించారు. కార్యక్రమంలో టీం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రీడా స్ఫూర్తి చాటాలి



మదనపురం: సీఎం కప్ క్రీడా పోటీలు అండర్ 18 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మదనాపురం జట్టు జిల్లా విజేతగా నిలిచి బహుమతులు సాధించారు. ప్రతిభ చాటిన వాలీబాల్ క్రీడాకారులు శ్రీకాంత్, శేఖర్, భాను, భరత్, వరుణ్, యశ్వంత్, నిక్షిత్, తేజ, ముజాసిర్, సంపత్, రాకీ ని గురువారం బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవుల బాలు, చాంద్‌పాషా, వెంకటేష్ యాదవ్, అశోక్ యాదవ్, కరుణాకర్ యాదవ్, నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సీపీఎం



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

పాన్‌గల్: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాటాలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు అన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని రేమద్దులలో వివిధ ప్రజాసంఘాలు, పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని పేదలు, రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, వివిధ సామాజిక వర్గాల వారు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని.. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా అమలు చేయడంలో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమవడంతో ప్రజా సంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో దీక్షలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, అసంపూర్తిగా ఉన్న రోడ్లు, పాఠశాల అదనపు తరగతి గదులను వెంటనే పూర్తి చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, భగత్, ఎండి ఖాజా, బాలరాజుగౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలి

వనపర్తి రూరల్: అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలంటూ సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు రమేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం జిల్లాకేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ఎండి జబ్బార్, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, కురుమయ్య, లక్ష్మి, సాయిలీల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. పేదల ఇంటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం ఆవాజ్ యోజన కింద రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్‌ను పునః ప్రారంభించి చిరు వ్యాపారులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టణంలో రహదారి విస్తరణ పనులు పూర్తిచేసి ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. దళితుల శ్మశానవాటికకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గట్టన్న, మదన్, మన్యం, రత్నయ్య, మహేష్, రాబర్ట్, పుల్లయ్య, రేణుక, భరత్‌కుమార్‌గౌడ్, మోహన్, చెన్నమ్మ పాల్గొన్నారు.

‘కోళ్ల పరిశ్రమపై విచారణ జరపాలి’



కొత్తకోట రూరల్: ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కోళ్ల పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దమందడి మండలం వెల్టూర్‌లో స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల సరిహద్దులో కొన్నేళ్ల క్రితమే పరిశ్రమను స్థాపించారని, వెల్టూరు శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు కూడా చేపట్టిందన్నారు. అధికారులు సర్వేచేసి కబ్జా చేశారని నిర్ధారించారని యజమానికి షోకాజ్ నోటీసులు జారీచేసి 10 నెలలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. కంపెనీ, అందులో ఉండే సిబ్బంది నివాసాలకు శంకర సముద్రం రిజర్వాయర్ నుంచి రోజు 10 లక్షల లీటర్ల నీటి తరలించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుందని.. ఏడాదిలో 0.01289 టీఎంసీలు మించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అధికంగా తరలిస్తోందని ఆరోపించారు. కంపెనీలోని వ్యర్థాలు పెద్దమునగాల్‌చేడు వాగులో కలిసి సరళాసాగర్ మీదుగా రామన్‌పాడు జలాశయంలో కలుస్తున్నాయని చెప్పారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కంపెనీని మూసివేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్‌సాగర్, చాకలి రమేష్, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, మ్యాదరి రాజు, దేవర శివ, కుర్వ నర్సింహ, శాఖ కొండన్న, గండి చంద్రయ్య, మూలమళ్ల రాములు, రాజేష్, బోయ వినయ్, బోయ దాసు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండలంలోని వెంగళాయిపల్లి, కేతేపల్లి సబ్‌సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు, వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పేర్లు పీహెచ్‌సీలో నమోదు చేయించాలని, వారికి క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్, ఐరన్ మాత్రలు ఇవ్వడంతో పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గర్భిణి పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు వివరించాలన్నారు. సబ్‌సెంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమాదేవి, శ్రీలక్ష్మి, ఆశాకార్యకర్తలు చిన్నమ్మ, కవిత, సంధ్య, సరోజమ్మ తదతరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు



అమరచింతలో కేక్ కట్ చేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: వందేళ్ల నుంచి ప్రజాపక్షాన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. సీపీఐ ప్రారంభమై వందేళ్లు అయినందున మండల కేంద్రంలోని సీపీఐ జెండా కట్టవద్ద గురువారం ఆ పార్టీ జెండా ఎగువవేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, కర్షక, నిరుపేద వర్గాల పక్షాన ఉంటూ నేటి వరకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నామన్నారు.పేదల పక్షాన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వందేళ్ల పోరాటంలో సీపీఐ అనేక ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడిన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్, మోషు, రఘు, సొలు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

టోకెన్ సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు ఈ నెల 27, 28న నిర్వహించే టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నుంచి జిల్లా కేంద్రంలోని మర్రికుంట వద్ద ఉదయం 10 గంటలకు టోకెన్ సమ్మె జరుగుతుందని, జిల్లాలోని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తరలిరావాలన్నారు. ప్రభుత్వం దిగి వచ్చేదాక దశల వారీగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, జిల్లా సహాయకార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, గంధం మదన్, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27, 28 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు రాజు, రాము డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సమ్మెపై కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుగ్రీవుడు, యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

ఆత్మకూర్: ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, రైతులు కలిసికట్టుగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్ అధ్యక్షతన పార్టీ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్‌తో పాటు మూలమళ్ల, పిన్నంచర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సీఎస్ శెట్టి, మోషు, భాస్కర్, కుతుబ్, లక్ష్మీనారాయణశెట్టి, నాగరాజు, కురుమన్న, లింగన్న, భీమన్న, చంద్రశేఖర్, నారాయణ్‌జీ, లక్ష్మన్న, దాసు, బాలస్వామి, మల్లేష్, గోవర్ధన్, చెన్నప్ప ఆదాం, హనుమంతు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



వీపనగండ్లలో వీరస్వామికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి, జమ్మాపూర్ గ్రామాల్లో వివిధ ప్రమాదాలల్లో మరణించిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కేతేపల్లి గ్రామానికి చెందిన గుజ్జుల తిరుపతయ్య కుటుంబానికి రూ.10 వేలు, కుర్వ రామచంద్రయ్య కుటుంబానికి రూ.5 వేలు, జమ్మాపూర్ గ్రామానికి చెందిన కుర్వ నాగయ్య కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, కాంట్రాక్టర్ తిరుపతయ్యసాగర్, మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, జూపల్లి యువసేన నాయకులు పాల్గొన్నారు.

మిత్రుల సహకారం

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వీరస్వామి ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారి సహ విద్యార్థులు గురువారం బాధితుడికి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. 1999–2000 అకాడమిక్ 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆటో డ్రైవర్ వీరస్వామికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మిత్రులు బత్తుల గంగులు, సురేందర్‌గౌడ్, విజ్ఞేష్, కృష్ణ, చిన్నరాముడు అన్నారు.

పాఠకుల అభిరుచికి నిలయం బుక్ ఫెయిర్



బుక్‌ఫెయిర్‌లో పాల్గొన్న శంకర్‌గౌడ్

వనపర్తి టౌన్: పుస్తక ప్రియుల అభిరుచికి నిలయం హైదరాబాద్ బుక్ ఫెయిర్ అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లో 37వ బుక్ ఫెయిర్‌ను సందర్శించారు. మూడు వందలకు పైగా ఉన్న బుక్ స్టాళ్లలో వైవిధ్యమైన కొన్ని లక్షల పుస్తకాలు ప్రదర్శనకు పెట్టడం అభినందనీయం అని ఆయన కొనియాడారు. ఇక్కడి సందర్శకులను చూస్తుంటే పాఠకుల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదని తెలుస్తుందన్నారు. ప్రతి జిల్లాలో బుక్ ఫెయిర్స్ నిర్వహించాలని, అందుకు వనపర్తి జిల్లాలో కూడా నిర్వహించడానికి తాము కొన్ని ప్రచురణ సంస్థలను కోరామని శంకర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు సూర చంద్రశేఖర్, శ్రీనివాస్, బైరోజు చంద్రశేఖర్, ప్రవీణ్, డాక్టర్ శ్యాంసుందర్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ప్రతిభ

పాన్‌గల్: రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.పల్లవి ప్రథమ బహుమతి, వి.పల్లవి తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో 37వ నేషనల్ బుక్ ఫెయిర్‌లో బాల సాహిత్య విభాగంలో ‘పుస్తకం ప్రాధాన్యత’ అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు (ఇంగ్లిష్ మీడియం)బహుమతులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారన్నారు.

బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

పెబ్బేరు రూరల్: బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా పెబ్బేరు మండలం బునాదిపురం గ్రామా నికి చెందిన తిరుపతయ్య యాదవ్‌ను నియమిస్తూ రాచాల యుగంధర్‌గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో రాచాల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని, బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానని వివరించారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్నగౌడ్, అంజన్నయాదవ్, మహేందర్, రాఘవేంద్రగౌడ్, మ్యాదరి రాజు, గౌతమ్ శంకర్, వసంతాచారి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరిన దీక్షలు

వనపర్తి విద్యావిభాగం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లాకేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరసన దీక్షలు గురువారం 17వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.